ప్రశ్నించడం కోసం...?

RNI NO. TELTEL/2023/90455

# మన ప్రజాప్రతినిధి

ప్రజా ప్రతినిధి NEWS టీ.వి

తెలుగు దిన పత్రిక

ఎడిటర్: జి. శ్రీనివాస్ సంపటి : 3 సంచిక :198బుధవారం మే 13 2026, పేజీలు - 4 వేల : 2/-

epaper.manaprajaprathinidhi.com

PUBLISHED FROM: TELANGANA /ANDHRAPRADESH

## చికెన్ ధరలకు రెక్కలు





**●ఎండలతో పెరిగిన ధరలు**
**●సరఫరా తగ్గడంతో భారంగా మారిన మాంసం**
**●సామాన్యులకు అరకిలోనే దిక్కు**




హైదరాబాద్, మే 12 (మనప్రజాప్రతినిధి): తెలంగాణలో చికెన్ ధరలు రోజురోజుకూ పెరుగుతూ మాంసాహార ప్రియులకు షాక్ ఇస్తున్నాయి. గత పది రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా ఎండల తీవ్రత పెరగడంతో కోడి మాంసం ధరలు ఒక్కసారిగా ఆకాశాన్నంటాయి. కేవలం పది రోజుల వ్యవధిలోనే కిలో చికెన్ ధర దాదాపు వంద రూపాయల వరకు పెరగడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారం రోజుల క్రితం వరకు కిలో స్కిన్‌లెస్ చికెన్ రూ.240 ప్రాంతంలో లభించగా, ప్రస్తుతం హైదరాబాద్‌లోని పలు మార్కెట్లలో రూ.350 నుంచి రూ.370 వరకు విక్రయిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో ధరలు ఇంకా ఎక్కువగా ఉన్నట్లు వినియోగదారులు చెబుతున్నారు. దీంతో గతంలో కిలోల వారీగా కొనుగోలు చేసిన కుటుంబాలు ఇప్పుడు అరకిలోతోనే సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.రాష్ట్రంలో 45 డిగ్రీలకు పైగా నమోదవుతున్న ఉష్ణోగ్రతలు పౌల్ట్రీ రంగంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఫారాల్లోని కోళ్లు అధిక వేడి కారణంగా తీవ్ర ఒత్తిడికి గురవుతున్నాయని పౌల్ట్రీ యజమానులు చెబుతున్నారు. కోళ్లు సరిగా ఆహారం తీసుకోకపోవడం, వడగాడ్పులను తట్టుకోలేక పెద్ద సంఖ్యలో మరణించడం వల్ల ఉత్పత్తి భారీగా తగ్గిపోయిందని పేర్కొంటున్నారు. కోళ్ల మరణాలతో మార్కెట్‌కు సరఫరా గణనీయంగా తగ్గిపోయింది. సాధారణంగా వేసవిలో చికెన్ వినియోగం కొంత తగ్గినా, ఈసారి సరఫరా మరింత పడిపోవడంతో ధరలు అదుపు తప్పుతున్నాయి. మార్కెట్‌లో డిమాండ్‌కు తగినంత చికెన్ అందుబాటులో లేకపోవడం వల్ల వ్యాపారులు అధిక ధరలకు విక్రయిస్తున్నారని తెలుస్తోంది. పౌల్ట్రీ దాణా ధరలు కూడా భారీగా పెరిగాయి. మొక్కజొన్న, సోయాబీన్ వంటి దాణా పదార్థాల ధరలు పెరగడం ఫారాల నిర్వహణ వ్యయాన్ని పెంచింది. మరోవైపు ఎండల సమయంలో కోళ్లను సురక్షితంగా తరలించేందుకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాల్సి రావడంతో రవాణా ఖర్చులు కూడా అధికమయ్యాయి. ఈ



అదనపు భారం మొత్తం చివరకు వినియోగదారులపై పడుతోంది. మార్కెట్ వర్గాల అంచనాల ప్రకారం, రాబోయే రోజుల్లో కూడా ఎండల తీవ్రత కొనసాగితే చికెన్ ధర కిలో రూ.400 వరకు చేరే అవకాశం ఉందని చెబుతున్నారు. దీంతో వినియోగదారులు ప్రత్యామ్నాయాల వైపు మొగ్గు చూపుతున్నారు. ప్రస్తుతం మటన్ ధరలు కిలోకు రూ.800 నుంచి రూ.1000 మధ్య ఉండగా, బొచ్చ, రవ్వ చేపలు రూ.200 ప్రాంతంలో లభిస్తున్నాయి. కొర్రమీను వంటి చేపల ధరలు కిలోకు రూ.300 వరకు పలుకుతున్నాయి. చికెన్ ధరల పెరుగుదలతో హోటల్ వ్యాపారులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చికెన్ వంటకాల ధరలు పెంచక తప్పని పరిస్థితి ఏర్పడిందని వారు చెబుతున్నారు. వేసవి కాలం ముగిసి వాతావరణం సాధారణ స్థితికి వస్తేనే ధరలు కొంత తగ్గే అవకాశం ఉందని పౌల్ట్రీ రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## గడ్కరీతో లోకేష్ భేటీ



**○గౌహతి విమానాశ్రయంలో సమావేశం**
**○ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిపై ప్రశంసలు**
**○మౌలిక వసతులపై చర్చ**

గౌహతి, మే 12 (మనప్రజాప్రతినిధి): తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ గౌహతి విమానాశ్రయంలో కేంద్ర రహదారులు, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దేశ నిర్మాణం, మౌలిక వసతుల అభివృద్ధిపై గడ్కరీ చూపుతున్న దూరదృష్టిని లోకేష్ ప్రశంసించారు. "భారత్ హైవే మాన్"గా గుర్తింపు పొందిన నితిన్ గడ్కరీ దేశవ్యాప్తంగా ఆధునిక రహదారుల నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నారని లోకేష్ పేర్కొన్నారు. వేగవంతమైన, బలమైన భారత నిర్మాణానికి ఆయన చేస్తున్న కృషి అందరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై గడ్కరీ ప్రశంసలు వ్యక్తం చేసినట్లు లోకేష్ తెలిపారు. రాష్ట్రంలో ప్రపంచ స్థాయి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఆయన అభినందించినట్లు పేర్కొన్నారు.గడ్కరీ ప్రోత్సాహం తమకు మరింత ఉత్సాహాన్ని ఇస్తోందని లోకేష్ అన్నారు. రాష్ట్రంలో వేగవంతమైన అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, మౌలిక వసతుల విస్తరణ లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉన్నామని చెప్పారు. ఈ సమావేశంలో పలు అభివృద్ధి అంశాలపై చర్చ జరిగినట్లు సమాచారం. ముఖ్యంగా రహదారులు, కనెక్టివిటీ, పారిశ్రామిక వృద్ధికి సంబంధించిన అంశాలు ప్రాధాన్యత పొందినట్లు తెలుస్తోంది. కేంద్ర–రాష్ట్ర సమన్వయంతో అభివృద్ధి పనులు మరింత వేగవంతం అవుతాయని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.



## జైళ్ల శాఖపై సమగ్ర సమీక్ష



**–ఖైదీల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి**
**–ప్రతి జిల్లాలో జైలు ఏర్పాటు దిశగా చర్యలు**
**–భద్రత, ఆధునికీకరణపై కీలక ఆదేశాలు**

అమరావతి, మే 12 (మనప్రజాప్రతినిధి): రాష్ట్ర జైళ్ల శాఖ పనితీరుపై హోంమంత్రి వంగలపూడి అనిత అమరావతి సచివాలయంలో సమగ్ర సమీక్ష నిర్వహించారు. జైళ్లలో అధిక రద్దీ తగ్గించడం, భద్రతా ప్రమాణాల బలోపేతం, ఖైదీల సంక్షేమం వంటి అంశాలపై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలోని పనిచేయని జైళ్ల పునరుద్ధరణపై అధికారులు తక్షణ కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. ప్రతి జిల్లాలో జైలు ఏర్పాటు చేసే

2

## భగీరథ్ అరెస్టుకు నిరసన



2

## చంచల్‌గూడలో జైలు మ్యూజియం ప్రారంభం




2

మన ప్రజాప్రతినిధి దినపత్రిక

బుధవారం మే 13 2026



# దేశ భద్రతపై కేంద్రం హై అలర్ట్

**-సరిహద్దుల నుంచి సైబర్ దాడుల వరకు అప్రమత్తమైన కేంద్రం**
**-ఉగ్ర ముప్పులు, అంతర్జాతీయ ఉద్రిక్తతల నేపథ్యంలో భద్రత కట్టుదిట్టం**



న్యూఢిల్లీ, మే 12 (మనప్రజాప్రతినిధి): దేశ భద్రతపై కేంద్ర ప్రభుత్వం అత్యంత అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. అంతర్జాతీయ పరిస్థితులు ఉద్రిక్తంగా మారుతున్న నేపథ్యంలో దేశవ్యాప్తంగా భద్రతా వ్యవస్థలను హై అలర్ట్‌లో ఉంచినట్లు తాజా పరిణామాలు సూచిస్తున్నాయి. ముఖ్యంగా ఉగ్రవాద ముప్పులు, సరిహద్దు ఉద్రిక్తతలు, కీలక స్థావరాల భద్రత, సైబర్ దాడుల అవకాశాలపై కేంద్ర హోంశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. దేశ రాజధాని ఢిల్లీతో పాటు ప్రధాన నగరాల్లో నిఘా వ్యవస్థను మరింత కట్టుదిట్టం చేశారు. విమానాశ్రయాలు, రైల్వే స్టేషన్లు, ప్రభుత్వ కార్యాలయాలు, రక్షణ సంస్థల వద్ద భద్రతా తనిఖీలు పెంచారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని భద్రతా సంస్థలు హెచ్చరికలు జారీ చేస్తున్నాయి. ఇటీవల ఢిల్లీలో ఉగ్రదాడులపై ఇంటెలిజెన్స్ సంస్థలు హెచ్చరికలు జారీ చేయడంతో భద్రతా బలగాలు రంగంలోకి దిగాయి. ముఖ్యంగా జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో అదనపు బలగాలను మోహరించారు. అనుమానాస్పద కదలికలపై నిఘా పెంచడంతో పాటు సీసీ కెమెరాల పర్యవేక్షణను కూడా విస్తరించారు. మరోవైపు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కాన్వాయ్ మార్గంలో బెంగళూరులో పేలుడు పదార్థాలు లభించడం దేశవ్యాప్తంగా ఆందోళనకు దారి తీసింది. ఈ ఘటన అనంతరం వీవీఐపీ భద్రతా వ్యవస్థను మరింత కఠినతరం చేసినట్లు సమాచారం. దేశ అత్యున్నత నాయకుల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదనే ఉద్దేశంతో కేంద్రం అన్ని రాష్ట్రాలకు అప్రమత్త సూచనలు జారీ చేసింది.సరిహద్దు భద్రత విషయంలో కూడా కేంద్రం అత్యంత జాగ్రత్తగా వ్యవహరిస్తోంది. పాకిస్థాన్, బంగ్లాదేశ్ సరిహద్దుల్లో అనుమానాస్పద కదలికలపై భద్రతా దళాలు నిఘా పెంచాయి. అక్రమ చొరబాట్లు, ఆయుధాల రవాణా, డ్రోన్ల ద్వారా స్మగ్లింగ్ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు. పంజాబ్‌లో సైనిక స్థావరాల సమీపంలో జరిగిన పేలుళ్లు భద్రతా సంస్థలను మరింత అప్రమత్తం చేశాయి. విదేశీ శక్తులు దేశంలో అస్థిరత సృష్టించే ప్రయత్నాలు చేస్తున్నాయనే అనుమానాలపై కేంద్ర దర్యాప్తు సంస్థలు విచారణ కొనసాగిస్తున్నాయి. సరిహద్దు ప్రాంతాల్లో అదనపు బలగాలను మోహరించడం ద్వారా కేంద్రం ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధమవుతోంది.దేశంలో సైబర్ భద్రత కూడా ఇప్పుడు కీలక అంశంగా మారింది. ప్రభుత్వ డేటా, బ్యాంకింగ్ వ్యవస్థ, ఇంధన రంగం, కమ్యూనికేషన్ వ్యవస్థలపై సైబర్ దాడుల ముప్పు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్రం ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థలను అమలు చేస్తోంది. ముఖ్యంగా విదేశీ హ్యాకర్ గుంపులు దేశ ఆర్థిక వ్యవస్థను లక్ష్యంగా చేసుకునే అవకాశాలపై అప్రమత్తంగా ఉంది.



అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు వెంటనే హెచ్చరికలు చేరేలా మొబైల్ అలర్ట్ వ్యవస్థను కూడా కేంద్రం బలోపేతం చేస్తోంది. ప్రకృతి వైపరీత్యాలు, ఉగ్ర ముప్పులు, ఇతర అత్యవసర పరిస్థితుల సమయంలో ఈ వ్యవస్థ కీలక పాత్ర పోషించనుంది.దేశ భద్రత అనేది ఇప్పుడు కేవలం సరిహద్దుల పరిరక్షణకే పరిమితం కాని అంశంగా మారింది. ఉగ్రవాదం, సైబర్ నేరాలు, అంతర్జాతీయ ఉద్రిక్తతలు, అంతర్గత భద్రతా సవాళ్లు అన్నీ కలిసిపోతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం భద్రతా వ్యవస్థలను సాంకేతికంగా మరింత బలోపేతం చేస్తోంది. రక్షణ రంగంలో స్వదేశీ సాంకేతికతకు ప్రాధాన్యత ఇస్తూ భారత్ తన శక్తిని పెంచుకుంటోంది. దేశ భద్రత కోసం భద్రతా దళాలు అప్రమత్తంగా పనిచేస్తుండగా, ప్రజలు కూడా బాధ్యతగా వ్యవహరించి అనుమానాస్పద అంశాలపై వెంటనే సమాచారాన్ని అందించడం ద్వారా సహకరించాల్సిన అవసరం ఉందని అధికారులు సూచిస్తున్నారు.

## జైళ్ల శాఖపై సమగ్ర సమీక్ష

మొదటి పేజీ తరువాయి




అవకాశాలను పరిశీలించాలని సూచించారు. జైళ్లలో మౌలిక వసతులు మెరుగుపరిచి ఖైదీలకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని పేర్కొన్నారు. ఖైదీల పునరావాస కార్యక్రమాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. డీ-అడిక్షన్ కేంద్రాలు, మానసిక ఆరోగ్య సహాయం, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను విస్తరించాలని సూచించారు. జైలు శిక్ష అనంతరం ఖైదీలు సమాజంలో గౌరవప్రదంగా జీవించేలా పునరావాస చర్యలు చేపట్టాలని అధికారులకు చెప్పారు. పెరోల్‌పై బయటకు వచ్చే ఖైదీల పర్యవేక్షణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని మంత్రి ఆదేశించారు. జైళ్లలో మొబైల్ ఫోన్ల వినియోగాన్ని పూర్తిగా అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. భద్రతా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని పేర్కొన్నారు. జైళ్ల శాఖలో ఉన్న ఖాళీలను త్వరగా భర్తీ చేయాలని అధికారులకు సూచించారు. శాఖ ఆధునికీకరణ, సంస్కరణలపై పూర్తి స్థాయి నివేదిక సిద్ధం చేయాలని ఆదేశించారు. ఖైదీల భద్రత, సిబ్బంది సంక్షేమం రెండింటినీ సమానంగా పరిగణించాలని తెలిపారు. రాష్ట్రంలో ప్రజా భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని వంగలపూడి అనిత పేర్కొన్నారు. జైళ్ల శాఖను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమావేశంలో జైళ్ల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు

## భగీరథ్ అరెస్టుకు నిరసన

మొదటి పేజీ తరువాయి



**-రాంనగర్‌లో బీఆర్ఎస్ ఆందోళన**
**-బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం**
**-గాయపడిన కానిస్టేబుల్‌కు పరామర్శ**

హైదరాబాద్, మే 12 (మనప్రజాప్రతినిధి): మైనర్ బాలికపై దాడి కేసులో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రాంనగర్ చౌరస్తాలో భారత రాష్ట్ర సమితి నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. పోక్సో చట్టం కింద నమోదైన కేసులో వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ముషీరాబాద్ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. బండి సంజయ్‌కు వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. దీంతో ప్రాంతంలో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నిరసన కార్యక్రమాన్ని అడ్డుకునే ప్రయత్నంలో ఒక పోలీస్ కానిస్టేబుల్ ప్రమాదవశాత్తు గాయపడినట్లు సమాచారం. వెంటనే అక్కడున్న నాయకులు, పోలీసులు కలిసి అతడిని సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రస్తుతం కానిస్టేబుల్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలుస్తోంది.గాయపడిన కానిస్టేబుల్‌ను పరామర్శించేందుకు ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్‌తో కలిసి బీఆర్ఎస్ నాయకులు ఆసుపత్రికి వెళ్లారు. వైద్యులతో మాట్లాడి కానిస్టేబుల్‌కు మెరుగైన చికిత్స అందించాలని కోరారు. ధైర్యంగా ఉండాలని అతనికి సూచించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ, మైనర్ బాలికకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. రాజకీయ ఒత్తిళ్ల కారణంగా కేసును బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నిందితుడిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. నిరసనల నేపథ్యంలో రాంనగర్ ప్రాంతంలో పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అదనపు బలగాలను మోహరించారు. కేసుకు సంబంధించిన దర్యాప్తు కొనసాగుతోందని అధికారులు తెలిపారు.

## చంచల్‌గూడలో జైలు మ్యూజియం ప్రారంభం

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్, మే 12 (మనప్రజాప్రతినిధి): తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చంచల్‌గూడ కేంద్ర కారాగారంలో తెలంగాణ ప్రిజన్స్ మ్యూజియంతో పాటు "ఫీల్ ది జైల్ ఎక్స్‌పీరియన్స్ – జైలు అనుభవం" కార్యక్రమాన్ని ప్రారంభించారు. జైలు వ్యవస్థలో జరిగిన మార్పులు, సంస్కరణలను ప్రజలకు తెలియజేసే లక్ష్యంతో ఈ ప్రత్యేక మ్యూజియంను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన గవర్నర్, తెలంగాణ ప్రిజన్స్ మ్యూజియం రాష్ట్ర కారాగార చరిత్రలో ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఒకప్పుడు జైళ్లు కేవలం శిక్షల కేంద్రాలుగా ఉండేవని, ఖైదీలు తీవ్ర శారీరక, మానసిక కష్టాలు అనుభవించేవారని గుర్తు చేశారు. కాలక్రమేణా జైలు వ్యవస్థ సంస్కరణలు, పునరావాసం, మానవ గౌరవానికి ప్రాధాన్యం ఇచ్చే దిశగా మారిందని తెలిపారు. మ్యూజియంలో పాత జైలు బ్యారక్కులు, సంకెళ్లు, గొలుసులు, ఉరి గల్లాలు, చారిత్రక వస్తువులు, ఆడియో-విజువల్ ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. గత శతాబ్దాల్లో ఖైదీల జీవితం ఎలా ఉండేదో ప్రజలకు అర్థమయ్యేలా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ఆధునిక జైళ్లు ఇప్పుడు సంస్కరణ కేంద్రాలుగా మారిన విధానాన్ని ఈ మ్యూజియం ప్రతిబింబిస్తోందని గవర్నర్ అన్నారు.తెలంగాణ కారాగార శాఖ చేపట్టిన ఈ వినూత్న కార్యక్రమాన్ని గవర్నర్ అభినందించారు. జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సౌమ్య మిశ్రా, ఆమె బృందం కృషిని ప్రశంసించారు. జైలు వ్యవస్థపై ప్రజల్లో అవగాహన పెంచడంలో ఈ మ్యూజియం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. "జైలు అనుభవం" కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రజలు 12 గంటలు లేదా 24 గంటల పాటు జైలు జీవితం ఎలా ఉంటుందో ప్రత్యక్షంగా అనుభవించేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. జైలు గది, ఖైదీల ఆహారం, క్రమశిక్షణ, నిత్యచర్యలను అనుభవించే అవకాశం కల్పిస్తున్నట్లు అధికారులు తెలిపారు. చట్టాల పట్ల గౌరవం, స్వేచ్ఛ విలువ, సామాజిక బాధ్యతపై అవగాహన కల్పించడమే దీని ప్రధాన ఉద్దేశమని చెప్పారు.డాక్టర్ సౌమ్య మిశ్రా మాట్లాడుతూ, గతంలో సంగారెడ్డిలో ఉన్న జైలు మ్యూజియం కూలిపోవడంతో మరింత ఆధునికంగా చంచల్‌గూడలో కొత్త మ్యూజియంను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఖైదీల సంక్షేమం, నైపుణ్యాభివృద్ధి, వ్యవసాయం, జైలు పరిశ్రమలు, పునరావాస కార్యక్రమాలపై కూడా ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో 1961 నుంచి 1968 వరకు ఖైదీలు చేసిన సేవలను కూడా మ్యూజియంలో ప్రదర్శించినట్లు తెలిపారు. ఓపెన్ ఎయిర్ జైలు విధానంలో ఖైదీలు దేశ నిర్మాణ కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావడం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ జైలు అనుభవం కోసం ప్రత్యేక వెబ్‌సైట్‌ను కూడా ప్రారంభించారు. ప్రజలు ఆన్‌లైన్ ద్వారా స్లాట్లు బుక్ చేసుకునే సౌకర్యం కల్పించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జైళ్ల శాఖ ఉన్నతాధికారులు, సిబ్బంది, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లపై సీఎం ఆదేశాలు



**-సరిహద్దుల నుంచి సైబర్ దాడుల వరకు అప్రమత్తమైన కేంద్రం**
**-ఉగ్ర ముప్పులు, అంతర్జాతీయ ఉద్రిక్తతల నేపథ్యంలో భద్రత కట్టుదిట్టం**

హైదరాబాద్, మే 12 (మనప్రజాప్రతినిధి): రాష్ట్రంలో ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల ప్రక్రియను మిషన్ మోడ్‌లో వేగంగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. క్యాంపు కార్యాలయం నుంచి వివిధ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి కొనుగోళ్ల పురోగతిని సమీక్షించారు. వివిధ జిల్లాల్లో ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్లలో ఎదురవుతున్న సమస్యలపై కలెక్టర్లను అడిగి తెలుసుకున్న ముఖ్యమంత్రి, ప్రతి అంశాన్ని ప్రత్యక్షంగా

3

మన ప్రజాప్రతినిధి దినపత్రిక



# ధాన్యం కొనుగోళ్లపై సీఎం ఆదేశాలు

తరువాయి భాగం




పర్యవేక్షించాలని సూచించారు. కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తేనే సమస్యలు తలెత్తవని, ఎక్కడైనా నిర్లక్ష్యం జరిగితే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగులు, హమాలీల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే గోదాములకు తరలించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు. లారీల కొరత ఉంటే ట్రాక్టర్లు, ఇతర వాహనాలను వినియోగించాలని రవాణా శాఖ అధికారులకు సూచించారు. ధాన్యం రవాణాలో జాప్యం జరిగితే రైతులు నష్టపోతారని పేర్కొన్న ముఖ్యమంత్రి, ఒప్పందం ప్రకారం వాహనాలు అందుబాటులో ఉంచని కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేయడానికీ వెనకాడొద్దని స్పష్టం చేశారు. ధాన్యం లోడ్ చేసిన వెంటనే రైతులకు రశీదులు అందించాలని, తాలు, తరుగు పేరుతో అక్రమాలు జరగకుండా చూడాలని ఆదేశించారు.కొన్ని ప్రాంతాల్లో గోదాముల కొరత ఉన్నట్లు సమాచారం వస్తోందని, అలాంటి చోట్ల తాత్కాలిక ఏర్పాట్లు చేయాలని సూచించారు. అవసరమైతే రైతు బజార్లు, ఫంక్షన్ హాళ్లను వినియోగించి ధాన్యాన్ని నిల్వ చేయాలని తెలిపారు. పరిస్థితులను బట్టి ధాన్యాన్ని అక్కడి నుంచి గోదాములకు తరలించేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. మొక్కజొన్న పంట అధికంగా పండే జిల్లాల్లో ప్రత్యేక దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి చెప్పారు. రైతులకు ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చోట పోలీసుల సహకారం తీసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. ప్రతి ఐకేపీ కేంద్రం, ప్రతి రైస్‌మిల్లు వద్ద ఒక బాధ్యతాయుత అధికారిని నియమించాలని ఆదేశించారు.అకాల వర్షాల సమయంలో రైతులకు నష్టం జరగకుండా శాశ్వత ప్రణాళికలు సిద్ధం చేయాలని కూడా ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ధాన్యం తడవకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని చెప్పారు. వాతావరణ శాఖ హెచ్చరికలను రైతులకు చేరవేసేందుకు మండల స్థాయిలో ప్రత్యేక అధికారులను నియమించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, సీతక్క, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎంపీ వేమ్ నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావుతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

# భగీరథ్ పిటిషన్‌పై ఉత్కంఠ



**-హైకోర్టును ఆశ్రయించిన భగీరథ్**
**-పోక్సో కేసు కొట్టివేయాలంటూ విజ్ఞప్తి**
**-రెండు వైపులా పరస్పర ఆరోపణలు**



హైదరాబాద్, మే 12 (మనప్రజాప్రతినిధి): తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ తనపై నమోదైన పోక్సో కేసును సవాలు చేస్తూ హైకోర్టును ఆశ్రయించారు. తనపై నమోదైన కేసులో ఎలాంటి వాస్తవం లేదని పేర్కొంటూ ఆ కేసును కొట్టివేయాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. భగీరథ్ దాఖలు చేసిన ఈ పిటిషన్‌పై ఈ నెల 14వ తేదీన హైకోర్టు వెకేషన్ బెంచ్‌లో విచారణ జరగనుంది. ఈ కేసులో న్యాయస్థానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే అంశంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. ఇటీవలి రోజులుగా ఈ వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.కేసు వివరాల ప్రకారం, 17 ఏళ్ల మైనర్ బాలికను భగీరథ్ వేధిస్తున్నాడంటూ ఆ బాలిక తల్లి ఫిర్యాదు చేశారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా మే 8వ తేదీన హైదరాబాద్‌లోని పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. పోలీసులు ఈ వ్యవహారంపై దర్యాప్తు కొనసాగిస్తున్నారు. అయితే తమపై వచ్చిన ఆరోపణలను భగీరథ్ వర్గాలు తీవ్రంగా ఖండిస్తున్నాయి. ఈ కేసు వెనుక రాజకీయ కుట్ర ఉందని, కావాలనే తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. ఎలాంటి తప్పు చేయకపోయినా తనను లక్ష్యంగా చేసుకుని ఈ వ్యవహారం నడిపిస్తున్నారని భగీరథ్ తరఫు వర్గాలు చెబుతున్నాయి.మరోవైపు ఈ కేసులో మరో కీలక మలుపు చోటుచేసుకుంది. బాలిక, ఆమె తల్లి తనను డబ్బు కోసం బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని, బెదిరింపులకు పాల్పడుతున్నారని భగీరథ్ కూడా ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు అదే రోజు కరీంనగర్ పోలీసులు బాలిక, ఆమె తల్లిపై కేసు నమోదు చేశారు. దీంతో ఈ వ్యవహారం మరింత సంచలనంగా మారింది. ప్రస్తుతం రెండు కేసులపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. ఒకవైపు పోక్సో కేసు, మరోవైపు బ్లాక్‌మెయిల్ ఆరోపణలు ఉండటంతో ఈ వ్యవహారం క్లిష్టంగా మారింది. రానున్న రోజుల్లో హైకోర్టు విచారణ, పోలీసు దర్యాప్తు ఆధారంగా కేసులో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని న్యాయవర్గాలు భావిస్తున్నాయి.

# తాగునీటిపై సీఎం సమీక్ష








**-వేసవిలో నిరంతర నీటి సరఫరాపై దృష్టి**
**-పురపాలక, గ్రామీణ శాఖలతో సమావేశం**
**-ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు**

చెన్నై, మే 12 (మనప్రజాప్రతినిధి): తమిళ నాడులో వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా కల్పించే అంశంపై ముఖ్యమంత్రి ఎస్. జోసెఫ్ విజయ్ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. పురపాలక పరిపాలన, నీటి సరఫరా శాఖతో పాటు గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖల పనితీరుపై ఆయన అధికారులతో చర్చించారు. రాష్ట్రంలోని పట్టణాలు, గ్రామాల్లో తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా వేసవి కాలంలో నీటి అవసరాలు పెరుగుతున్నందున సరఫరాలో ఎక్కడా అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.పురపాలక సంస్థలు, గ్రామ పంచాయతీలు క్షేత్రస్థాయిలో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని సీఎం పేర్కొన్నారు. తాగునీటి నిల్వలు, పంపిణీ వ్యవస్థ, ట్యాంకర్ల అందుబాటు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో బోర్‌వెల్లు, నీటి ట్యాంకులు, పైప్‌లైన్ వ్యవస్థల పనితీరును పరిశీలించాలని సమావేశంలో చర్చించారు. అవసరమైన చోట తాత్కాలిక ఏర్పాట్లు చేసి ప్రజలకు తాగునీరు అందేలా చూడాలని సీఎం స్పష్టం చేశారు. నీటి వృథాను నివారించేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కూడా సూచించారు.వేసవి కాలంలో నీటి సంక్షోభాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి ఎస్. జోసెఫ్ విజయ్ అన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఈ సమీక్ష సమావేశంలో ఉన్నతాధికారులు, పురపాలక శాఖ ప్రతినిధులు, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నీటి సరఫరా పరిస్థితులపై జిల్లా వారీగా సమీక్షించినట్లు సమాచారం.



# నర్సులకు రాష్ట్రపతి పురస్కారాలు

**-అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా సత్కారం**
**-ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డుల ప్రదానం**
**- సేవాభావానికి రాష్ట్రపతి ప్రశంసలు**





న్యూఢిల్లీ, మే 12 (మనప్రజాప్రతినిధి): అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా విశిష్ట సేవలు అందించిన నర్సింగ్ సిబ్బందికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జాతీయ ఫ్లోరెన్స్ నైటింగేల్ పురస్కారాలను ప్రదానం చేశారు. రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ అవార్డులను అందజేశారు. ఆరోగ్య రంగంలో నిస్వార్థ సేవలు అందిస్తూ ప్రజల ప్రాణాలను కాపాడుతున్న నర్సింగ్ సిబ్బంది సేవలను రాష్ట్రపతి ఈ సందర్భంగా కొనియాడారు. అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో కూడా నర్సులు అంకితభావంతో విధులు నిర్వర్తిస్తూ నాణ్యమైన వైద్య సేవలను అందిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో నర్సింగ్ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తెలిపారు. సేవా దృక్పథం, సహనం, మానవత్వానికి నర్సులు ప్రతీకలుగా నిలుస్తున్నారని అన్నారు. ముఖ్యంగా అత్యవసర పరిస్థితులు, విపత్తుల సమయంలో వారి సేవలు దేశానికి ఎంతో అవసరమవుతున్నాయని వివరించారు.జాతీయ ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డులు వైద్య రంగంలో విశిష్ట సేవలు అందించిన నర్సులకు ఇచ్చే అత్యున్నత గౌరవాల్లో ఒకటిగా భావిస్తారు. గ్రామీణ ప్రాంతాలు, ప్రభుత్వ ఆసుపత్రులు, అత్యవసర వైద్య సేవల్లో విశేష కృషి చేసిన నర్సింగ్ సిబ్బందిని ఈ పురస్కారాలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో కేంద్ర ఆరోగ్య శాఖకు చెందిన ఉన్నతాధికారులు, వైద్య రంగ నిపుణులు, నర్సింగ్ ప్రతినిధులు పాల్గొన్నారు. అవార్డు గ్రహీతలను పలువురు అభినందించారు. దేశ ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో నర్సుల పాత్ర మరింత కీలకమవుతోందని నిపుణులు పేర్కొన్నారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా పలు ఆసుపత్రుల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజల ఆరోగ్య రక్షణలో నిరంతరం సేవలందిస్తున్న నర్సింగ్ సిబ్బందికి వివిధ వర్గాల నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

# హనుమాన్ జయంతి వేడుకలు



మనప్రజాప్రతినిధి//కొండపాక మండల్:మండల కేంద్రం లోని హనుమాన్ దేవస్థానంలో హనుమాన్ జయంతి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే దేవస్థానానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణం లో భజనలు, మంత్రోచ్ఛారణల మధ్య ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అనంతరం స్వామివారికి అభిషేక పూజ, చందన పూజ, ఆకు పూజ, వడమాల పూజలను విశేషంగా నిర్వహించారు. మాన్యసూక్త హోమము, గణపతి హోమము, నవగ్రహ హోమములు నిర్వహించి ప్రజలు సుఖశాంతులతో ఉండాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భక్తులు సమిష్టిగా హనుమాన్ చాలీసా పారాయణం చేసి స్వామివారి కృపా కటాక్షాలు పొందారు.పూజా కార్యక్రమాల లో భాగంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. భక్తులు మాల విరమణ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

# హరీశ్ రావు రైతులను రెచ్చగొడుతున్నాడు రాష్ట్ర రైతు కమిటీ చైర్మన్ కోదండరెడ్డి



మన ప్రజా ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట మే 12,:హరీష్ రావు రైతులను రెచ్చగొడుతున్నారని రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి అన్నారు. చేగుంట మండల పరిదిలోని కర్ణాల పల్లి గ్రామం లో ఉన్న ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని డైరెక్టర్ భవాని రెడ్డి, దుబ్బాక కాంగ్రెస్ ఇంచార్జ్ సి హెచ్ శ్రీనివాస్ రెడ్డి తో కలిసి సందర్శించారు, ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ హరీశ్ రావు రైతులను రెచ్చగొట్టి రాజకీయం చేస్తున్నాడని, ఇదిఏమాత్రం సరికాదన్నారు. కేంద్రాల వద్దకు వచ్చి చూసి, సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెల్లేలా ప్రతిపక్ష బిఆర్ఎస్ నేతలు పని చేయాలన్నారు. ఈ కార్యక్రమం చెరుకు శ్రీనివాస్ రెడ్డి,భవానీ రెడ్డి..., ఈ కార్యక్రమం లో ఆత్మ కమిటీ చైర్మన్ గాంధారి నరేందర్ రెడ్డి,మండల అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్, చేగుంట సర్పంచ్ సంద్రుగు స్రవంతి సతీష్, వడియారం సర్పంచ్ సాయికుమార్ గౌడ్, రెడ్డిపల్లి పిఏసిఎస్ చైర్మన్ మ్యాకల పరమేష్,ఉపాధ్యక్షులు మసాయిపేట్ శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్, మొహమ్మద్ ముజామిల్, స్టాలిన్ నర్సిములు, కాషాబోయిన శ్రీనివాస్, అన్నం ఆంజనేయులు, కుర్మ లక్ష్మి, దౌల్తాబాద్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పడాల



రాములు, మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లపల్లి కనకయ్యా,కాసాన్ పల్లి సర్పంచ్ బిక్య నాయక్,చేగుంట ఉపసర్పంచ్ మొహ్మమ్మద్ రఫీ, చందాయిపేట్ ఉపసర్పంచ్ నగేష్ గుప్తా,కర్ణంపల్లి గ్రామ అధ్యక్షులు చింతఆకుల లింగం, ఉపాధ్యక్షులు శేఖర్ గౌడ్, సినియర్ నాయకులు యాదిరెడ్డి, రామపూర్ మాజీ సర్పంచ్ కాషాబోయిన భాస్కర్,యూవ నాయకులు సంద్రుగు శ్రీకాంత్, అయిత పరంజ్యోతి,సర్పంచ్ బండారి లాలు, బాస రాజు, కొండల్ రెడ్డి, రాజారామ్,వివిధ గ్రామాల సినియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కల్లుగీత కార్పొరేషన్ చైర్మన్ ను కలిసిన జుకంటి రాజగౌడ్

మనప్రజాప్రతినిధి//మెదక్ జిల్లా చేగుంట మే 11:నూతన కల్లుగీత పారిశ్రామిక సంఘం చైర్మన్ గా మోత్కూరి చంద్రశేఖర్ గౌడ్ ఎన్నికైన సందర్భంగా హైదరాబాద్ లోని తన కార్యాలయంలో కలిసి పూలమాలవేసి శాలువా తో సత్కరించిన మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జుకంటీ రాజా గౌడ్, ఈ సందర్బంగా రాజగౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో గీతా కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించి గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.



# బోనాల రైతు వేదికలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు





మనప్రజాప్రతినిధి/రాజన్నసిరిసిల్ల, మే, 12:రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల మండలం బోనాల గ్రామంలోని రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అన్నదాతల అవగాహన కార్యక్రమం" విజయవంతమైంది. "అన్నదాతల అభివృద్ధి కార్యక్రమం" (ఏప్రిల్ 27 మే 23) లో భాగంగా ఈ సదస్సును ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. జి. ప్రియదర్శిని మాట్లాడుతూ, రైతులు అధికంగా యూరియా వాడడాన్ని తగ్గించి సాగు ఖర్చులను నియంత్రించుకోవాలని సూచించారు. నేల సారాన్ని కాపాడుకోవడానికి పంటల మార్పిడి పద్ధతులు పాటించాలని, నీటిని పొదుపుగా వాడుతూ సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని ఆమె కోరారు.వ్యవసాయ అధికారి శ్రీ కె. సందీప్ మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న వివిధ వ్యవసాయ పథకాలు, సబ్సిడీల గురించి వివరించారు. ముఖ్యంగా ఆయిల్ పామ్ సాగుకు ఉన్న ప్రోత్సాహకాలను, సన్నగింజ వడ్ల రకాల ప్రాధాన్యతను రైతులకు వివరించారు. విద్యార్థులు పి. శ్రీధర్ మరియు పి. ఆదిత్య వర్మీ కంపోస్ట్ తయారీ విధానంపై రైతులకు ప్రత్యక్ష అవగాహన కల్పించారు.వ్యవసాయ విస్తరణ అధికారి బి. రాజ్ కుమార్ మాట్లాడుతూ, రైతులు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సుమారు 49 మంది రైతులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కోతుల బెడద నుండి పంటలను రక్షించుకోవడానికి సోలార్ ఫెన్సింగ్‌పై ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వాలని రైతులు కోరారు.సన్న రకం వడ్ల విత్తనాలు, పచ్చి ఎరువుల విత్తనాలను గ్రామ స్థాయిలోనే సకాలంలో అందుబాటులో ఉంచాలని విజ్ఞప్తి చేశారు.రైతుల నుంచి విశేష స్పందన లభించిన ఈ కార్యక్రమం, వారిలో సాగు పట్ల అవగాహన పెంచడంలో కీలక పాత్ర పోషించిందని నిర్వాహకులు హర్షం వ్యక్తం చేశారు.

# బండి సాయి భగీరథను వెంటనే అరెస్టు చేయాలి



నేరేడుచర్ల(మన ప్రజా ప్రతినిధి దినపత్రిక ) కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్వి బిఆర్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో మంగళవారం నేరేడుచర్ల చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు.ఈ సందర్భంగా బండి సాయి భగీరథ చిత్రపటాలను దహనం చేస్తూ నాయకులు నిరసన తెలిపారు.అనంతరం బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు రాపోలు నవీన్ కుమార్ మాట్లాడుతూ... మైనర్ బాలికపై జరిగిన ఘటనను హనీ ట్రాప్‌గా చూపిస్తూ కేసును నిర్వీర్యం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు.ఈ వ్యవహారంలో ప్రభుత్వం తక్షణమే స్పందించి బండి సాయి భగీరథను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించాలని డిమాండ్ చేశారు.అలాగే ఘటనకు బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రి బండి సంజయ్ తన పదవికి రాజీనామా చేయాలని కోరారు.బాధిత బాలిక కుటుంబానికి న్యాయం జరిగే వరకు ప్రతి ఒక్కరూ పోరాటం కొనసాగించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వై రాష్ట్ర నాయకులు ఎండీ షోయబ్,మాజీ విద్యార్థి విభాగం అధ్యక్షులు పల్లెపంగ నాగరాజు,పెరుమాళ్ల సతీష్ కుమార్,తకెళ్ల నాగార్జున,షేక్ నాగుల్ మీరా,మాతంగి సతీష్ కుమార్,పోలే అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నేరేడుచర్లలో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

నేరేడుచర్ల( మన ప్రజా ప్రతినిధి దినపత్రిక ):పవనపుత్రుడు శ్రీ హనుమాన్ జన్మదిన మహోత్సవాలను మంగళవారం నేరేడుచర్ల పట్టణం,మండలంలోని వివిధ దేవాల యాల్లో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.నేరేడుచర్ల పట్టణంలోని శ్రీ కోదండరామాలయం,శివాలయం, పాత నేరేడు చర్ల,నర్సయ్యగూడెం, అభ యాంజనేయ స్వామి దేవాలయం, పట్టణం లోని పాత రామాలయంలో స్వామివారి దర్శనానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు .ప్రత్యేకంగా అలంకరించిన దేవాలయాల్లో వేద పండితులు



తెల్లవారుజాము నుంచే స్వామివారికి అభిషేకాలు,తమలపాకులతో ఆకు పూజలు,ప్రత్యేక అర్చనలు నిర్వహించారు.భక్తులు జై శ్రీరామ్,జై హనుమాన్ నినాదాలతో ఆలయ ప్రాంగణాలను మార్మోగించారు.పాత నేరేడుచర్లలోని అభయాంజనేయ స్వామి దేవాలయంలో భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించగా,భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.అనంతరం ఆయా దేవాలయ కమిటీల ఆధ్వర్యంలో భక్తులకు పూజల అనంతరణ తీర్థప్రసాదాలు అందజేశారు.

# ఉల్లాసంగా... ఉత్సాహంగా... వేసవి ఆనంద శిబిరం

నేరేడుచర్ల (మన ప్రజా ప్రతి నిధి దినపత్రిక )పిఎంశ్రీ జిల్లాపరిషత్ఉన్నతపాఠశాల నేరేడుచర్ల నందు నిర్వహిస్తున్న వేసవి శిబిరంలో క్రీడలు, యోగ, సంగీతం, నృత్యముల పట్ల ఆసక్తితో అధిక సంఖ్యలో విద్యార్థులు హాజరవుతున్నారు శిబిరం ఈనెల 25 వరకు కొనసాగుతుందని ప్రధానోపాధ్యాయులు బట్టు మధు తెలిపారు డాన్స్ మాస్టర్ రాజు విద్యార్థులను ఎంతో ప్రోత్సహిస్తూ పాటలకు డాన్స్ నేర్పుతున్నారు చిత్రలేఖనం భాషానైపుణ్యాల సాధనకై ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని వేసవి సెలవులను విద్యార్థులు కొత్త విషయాల సాధనకై ఇట్టి వేసవి శిబిరాలను వినియోగించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆర్ శౌరి ,ఎం బాలు, ఎన్ వి, సరిత పాల్గొన్నారు



# గంగాధర క్షేత్రంలో ఘనంగా అష్టమ వార్షికోత్సవ వేడుకలు



మన ప్రజాప్రతినిధి/మనకొండూరు తేదీ 12 మే:ఇల్లంతకుంట మండల కేంద్రంలో ఎంతో ప్రసిద్ధిగాంచిన గంగాధర క్షేత్రంలో "అష్టమ వార్షికోత్సవ" వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వేద పండితులు, ఆలయ వ్యవస్థాపకుడు మూగు నాగరాజు శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, మహా చండీ హోమం, స్పటిక లింగానికి విశేష ద్రవ్యాలచే అభిషేకాలను నిర్వహించారు. అనంతరం గంగాధర క్షేత్రం లోని మూగు దామోదర శర్మ అన్నదాన సత్రంలో భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.కార్యక్రమంలో ప్రముఖ పురోహితులు, వ్యవస్థాపకులు మూగు నాగరాజు శర్మ, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

# కాంట అయినా రైతుల గోస తప్పడం లేదు



మన ప్రజా ప్రతినిధి కొండపాక మండలం: రాష్ట్ర ప్రభుత్వము రైతాంగం పట్ల తీసుకున్న విధానంతో రైతుల హరిగోస పడుతున్నారని వడ్ల కొనుగోల్లను వేగవంతం చేసి లారీలను ఎక్కువ తెప్పించే వెంట వెంటనే ధాన్యం లోడ్ చేసి పంపించాలని సిపిఎం మండల కార్యదర్శి అమ్ముల బాల్ నర్సయ్య డిమాండ్ చేశారు. మంగళవారం రోజున జప్తి నాచారం వరి కొనుగోలు కేంద్రాన్ని సిపిఎం,రైతు సంఘం ఆధ్వర్యంలో సందర్శించి రైతుల ఇబ్బందులను అడిగి తెలుసుకోవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా బాల్ నర్సయ్య మాట్లాడుతూ వరి కోతల కోసి మార్కెట్లో ఉప్పలు పోసి నెల రోజులు గడిచిందని రైతుల కంటికి నిద్ర లేకుండా వరికుప్పల వద్దనే కొనుకవలసి వస్తుందన్నారు. లారీల కొరత పేరుతో వడ్లు ఎండి కాంట అయిన ఎక్కించకపోవడం చూస్తే రైతుల గోస వర్ణాతితం అన్నారు. ఒకపక్క ఎండలు 40 నుంచి 45 డిగ్రీల ఎండలో రైతులు కుప్పల వద్ద కుప్పకూలిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.వెంటనే అధికారులు ప్రభుత్వ స్పందించి లారీలు తెప్పించి మార్కెట్ నుండి ధాన్యాన్ని పంపించే విధంగా చూడాలని కోరారు.కొనుగోలను వేగవంతం చేయాలని కోరారు 90 లక్షల టన్నుల వడ్లు కొంటామని చెప్పిన ప్రభుత్వం కనీసం 10 లక్షల టన్నులు కూడా కొనలేదన్నారు ప్రతి మార్కెట్ కు లారీల సంఖ్యను పెంచాలన్నారు. ఒకే లారీ రావడంతో లోడు అయిన తర్వాత అన్లోడ్ త్వరగా కావడం లేదన్నారు.తిరిగి అదే లారీ రావాలంటే లారీ ఓనర్స్ ఆ లారీలను ఇతర అవసరాలకు వాడుకోవడంతో ఆలస్యం జరుగుతుందని అన్నారు.అకాల వర్షాల వల్ల వడ్లు నాని కొట్టుకుపోతున్నాయని రైతులు ఆందోళనకు గురి అవుతున్నారని వారి ఆవేదనను అర్థం చేసుకోవాలని కోరారు. రైతులను ఇబ్బందులకు గురి చేయడమే అవుతుందన్నారు. వెంటనే కొనుగోలను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో రైతులతో ఆందోళన కార్యక్రమాలు చేపట్టవలసి వస్తుందని ప్రభుత్వానికి హెచ్చరించారు ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మూడోజు కనకాచారి, జప్తి నాచారం గ్రామ రైతులు, హమాలీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.




# ఉపాధి పనులను ఆకస్మికంగా తనిఖీ



మనప్రజాప్రతినిధి//అక్బర్ పేట్ భూంపల్లి మండల్:ఉపాధి పనులను ఆకస్మికంగా తనిఖీ చేసిన అక్బర్పేట్ భూంపల్లి మండల్ ఎంపీడీవో సోమిరెడ్డి.ఆల్మస్ పూర్ గ్రామంలో ఉపాధి హామీ కూలీలకు ఓ అర్ ఎస్ , మంచి నీటి పంపిణీ చేసిన ఏం పి డి ఓ వి సోమిరెడ్డి. ఏ పి ఓ చంద్రశేకర్. డి ఆర్ పి మరియు పంచాయతీ కార్యదర్శి కీర్తన. ఆశవర్కర్ ఇందిర. మండల శ్రీనివాస్.సర్పంచ్ మీరపురం పద్మ మల్లేశంఅక్బర్ పేట్ భూంపల్లి మండల పరిధిలోని ఆల్మస్పూర్ గ్రామంలో ఉపాధి హామీ పథకం (చీ=జు+టా) పనుల్లో నిమగ్నమైన కూలీలకు సర్పంచ్ మీరపురం పద్మ మల్లేశం ఆధ్వర్యంలో మంగళవారం రోజున ఓ ఆర్ ఎస్ మరియు మంచి నీటి బాటిళ్లను పంపిణీ చేశారు. ఏం పి డి ఓ మాట్లాడుతూ... గ్రామంలోని రైతులకు సాగు పనుల కోసం వెళ్లే మార్గాలను సుగమం చేసే ఉద్దేశంతో, ఉపాధి హామీ పథకం కింద చెరువు కుంటాల పనులను చేపట్టడం జరుగుతోంది. ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో, పనులకు వచ్చే కూలీలు వడదెబ్బకు గురికాకుండా ఉండాలని మరియు వారి దాహార్తిని తీర్చాలనే ఉద్దేశంతో ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టినట్లు వార్డు మెంబర్లు తెలిపారు.ఈ సందర్భంగా (గుజ్జుల చంద్రం ఉప సర్పంచ్ ),వార్డ్ మెంబర్ మండల నర్సిములు. పి పద్మ, వి నర్సింహారెడ్డి,గ్రామ అభివృద్ధిలో కూలీల పాత్ర ఎంతో కీలకమైనది. తీవ్రమైన ఎండలను సైతం లెక్కచేయకుండా కసమోని కుంట లో మట్టిలో ఉన్న పోశకాల గురించిఅక్బర్ పేట్ భూంపల్లి మండల్.ఏం పి డి ఓ ఉపాధి హామీ కూలీలకు తెలుపడం జరిగింది.చెరువు కుంటాల్లో పనుల్లో పాల్గొంటున్న కూలీల సౌకర్యార్థం ఈ చిన్న ప్రయత్నం చేశాము. రైతులకు సాగు బాటలు మెరుగుపడటంతో పాటు, కూలీలకు ఉపాధి దొరకడం సంతోషకరం.ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం సిబ్బంది గోరిమిండ్ల మహేష్ , కూలీలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు. తమ పట్ల చొరవ చూపి ఓ ఆర్ ఎస్ పాకెట్స్ , మంచి నీరు పంపిణీ చేసిన వార్డుమెంబెర్స్ .కూలీలు నాంపల్లి, కనకయ్య, చిక్కుడు అంజయ్య, బి రాజయ్య,పి మంజుల, జి రవి, పద్మ ఎల్లం, పురుషోత్తం, మనమ్మ,అశోక్,మల్లవ్వ,కృతజ్ఞతలు తెలిపారు

# బండి భగీరథ్‌కు సిట్ నోటీసులు



## - పోక్సో కేసులో విచారణకు హాజరుకావాలని ఆదేశం
## - పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు రావాలని సూచించిన ప్రత్యేక దర్యాప్తు బృందం

హైదరాబాద్, మే 12 (మనప్రజాప్రతినిధి): కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడైన బండి భగీరథ్‌కు ప్రత్యేక దర్యాప్తు బృందం సిట్ నోటీసులు జారీ చేసింది. మైనర్ బాలికపై లైంగిక దాడి చేశాడనే ఆరోపణల నేపథ్యంలో అతనిపై పోక్సో చట్టం కింద కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ కేసు దర్యాప్తు చేపట్టిన సిట్ అధికారులు విచారణలో భాగంగా బండి భగీరథ్‌ను హాజరుకావాలని ఆదేశించారు. రేపు మధ్యాహ్నం రెండు గంటలకు పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి విచారణలో పాల్గొనాలని నోటీసుల్లో పేర్కొన్నారు.బండి భగీరథ్ కేంద్ర మంత్రికి కుమారుడు కావడంతో ఈ వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. కేసు విచారణ పారదర్శకంగా, నిష్పాక్షికంగా జరగాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే డీజీపీకి ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసి కేసును లోతుగా విచారిస్తున్నారు. బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం కేసు తీవ్రత దృష్ట్యా సిట్‌కు దర్యాప్తు బాధ్యతలు అప్పగించారు. ఇక ఈ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. తనను హనీట్రాప్ చేశారని ఆరోపిస్తూ బండి భగీరథ్ కరీంనగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం. తనపై ఉద్దేశపూర్వకంగా కుట్ర జరుగుతోందని, తప్పుడు ఆరోపణలతో ఇరికించే ప్రయత్నం చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలుస్తోంది. దీంతో ఈ కేసు మరింత సంచలనంగా మారింది. ఒకవైపు బాధితురాలి కుటుంబం న్యాయం కోరుతుండగా, మరోవైపు బండి భగీరథ్ తనపై కుట్ర జరిగిందని చెబుతుండటంతో కేసుపై ఉత్కంఠ నెలకొంది.ఈ వ్యవహారంపై రాజకీయ వర్గాల్లో కూడా చర్చ కొనసాగుతోంది. అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు వినిపిస్తున్నాయి. కేసును రాజకీయ కోణంలో కాకుండా చట్టపరంగా విచారించాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. మైనర్ బాలికకు సంబంధించిన కేసు కావడంతో పోలీసులు అత్యంత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. బాధితురాలి వివరాలు గోప్యంగా ఉంచుతూ చట్ట ప్రకారం విచారణ కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం అందరి దృష్టి రేపు జరగనున్న విచారణపైనే ఉంది. సిట్ అధికారులు బండి భగీరథ్ నుంచి వివరణ తీసుకుని తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. కేసుకు సంబంధించిన సాక్ష్యాలు, ఫోన్ వివరాలు, ఇతర ఆధారాలను కూడా అధికారులు పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఈ వ్యవహారం రాష్ట్ర రాజకీయాల్లో మరింత చర్చనీయాంశంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.